అడల్ట్స్ ఓన్లీ కథ A

# ఏకాంతం

ఆకునూరి మురళీకృష్ణ

రాత్రి పది గంటలు..

కార్తీక్‌కి ఆ విషయం భార్య దగ్గర ఎలా కదపాలో తోచడం లేదు. ఆలోచిస్తూ పుస్తకం తిరగేస్తున్నాడు.

హఠాత్తుగా అతను చదువుతున్న పుస్తకాన్ని చేత్తో లాగేసి అతన్ని అల్లుకుపోయి అతని పెదవుల్ని తన పెదవుల్తో మూసేసింది వనిత.

ఆ స్పర్శకి ఒళ్లు పులకించింది కార్తీక్‌కి.

ఉదయం నుంచీ ఆలోచనలతో వేడెక్కిపోతున్న మెదడుకి ఒక్క క్షణం విశ్రాంతి దొరికినట్టయింది.

రెండు చేతులతోను ఆమెని తనకేసి హత్తుకున్నాడు.

''వనితా.. నీతో ఒక విషయం మాట్లాడాలి''

వనిత అతని కళ్లలోకి చిలిపిగా చూసి నవ్వింది.

''ఇప్పుడేం మాట్లాడదలుచుకున్నా శబ్దం రాకుండా పెదవులతోనే మాట్లాడాలి'' అంది.

''శబ్దం రాకుండా ఎలా మాట్లాడడం?''

''ఇలా'' అంటూ ఆమె పెదవుల్ని సున్నాలా చుట్టి అతడిని గాఢంగా ముద్దు పెట్టుకుంటూ ''అర్థమైందా నేను ఏం చెప్పాను'' అంది.

అతడి మనసులోని టెన్షన్స్ అన్నిటి మీదా మన్మథుడు తన అస్త్రాలని సంధించినట్టు మాయమైపోయాయి.

ఆవేశంగా ఆమెని చుట్టేసాడు.

శరీరాలు మాట్లాడుకునేటప్పుడు అడ్డంగా తామెందుకని వస్త్రాలు వారిని విడిచిపెట్టేసాయి.

ఇరువురి శరీరాలూ అలసిపోయి మగత కమ్మినట్టు నిద్రపోయారు.

తెల్లవారుఝామునెపుడో మెలకువ వచ్చి, అడిగింది వనిత అతన్ని-

''రాత్రి నాతో మాట్లాడాలన్నారు?'' అని.

కార్తీక్ ఒకసారి గాఢంగా నిట్టూర్చాడు.


''వనితా.. అమ్మ నిన్న పొద్దున్న నాతో ఓ విషయం చెప్పింది. వూళ్లో వున్న మా ఇంటిని బాగు చేయించుకుని ఇక మీదట నాన్నా తను అక్కడే వుంటామంది. ఈరోజే బయలుదేరి వెళ్తామని కూడా చెప్పింది''

''అవును. అత్తయ్యగారు ఈ విషయం నాతో కూడా చెప్పారు. నిన్నంతా ఇద్దరూ కలిసే వాళ్లకు కావలసినవన్నీ సర్దాం. ప్రయాణానికి ఏర్పాట్లు కూడా చేసాము''

''వనితా.. పెళ్లయి ఈ ఇంటికి వచ్చిన రోజు అమ్మ నీతో ఏమందో గుర్తుందా? 'నాకు ఇద్దరు పిల్లలు వుండాలని వీడు పుట్టక ముందు కలలు కనే దాన్ని. పరిస్థితుల వల్ల ఒక్కడితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇన్నాళ్లూ నాకు అదో లోటుగా వుండేది. ఇపుడా లోటు ఇక నాకు లేదు. నిన్ను కూడా నా బిడ్డలాగా చూసుకుంటాను' అంది గుర్తుందా?''

''అవును అన్నారు. ఆరోజునుంచీ ఇప్పటి వరకూ అలాగే చూసుకున్నారు కూడా'' అంది వనిత.

''ఎంత ప్రేమగా



## కొత్త ఇన్నింగ్స్

టాలీవుడ్‌నుంచి బాలీవుడ్‌కి రావడం కామన్ అయిపోయిందిప్పుడు. అసలు సంగతేంటంటే బాలీవుడ్ తార మల్లికా షెరావత్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ని ఇప్పుడు టాలీవుడ్‌తో ప్రారంభిస్తోంది. రవితేజ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మల్లిక తన అందాల్ని ఆరబోసి కెరీర్‌లో కొత్త ద్వారాల్ని తెరవబోతోందన్నమాట. రమేష్ దర్శకత్వంలో మాస్ హీరో రవితేజ సరసన నటిస్తున్న మల్లిక మెరుపులు సామాన్యమైనవేం కాదని త్వరలో తెలిసొస్తుంది. బాలీవుడ్‌లో ఆమె నటించిన క్వాహిస్ చిత్రం సంచలనం రేపింది. మరో కొత్త సంచలనం కోసం మనం ఎదురుచూడాల్సిందే.



చూసినా అత్త అత్తే. అమ్మకాదు. నేనూ ఒప్పుకుంటానరు. పెళ్లయిన కొత్తలో అందరూ ఆడపిల్లలకీ వున్నట్టే నీకూ ఏవేవో సరదాలుండొచ్చు. తప్పనడం లేదు. కానీ మన సరదాలకి అడ్డంగా వున్నారని మనల్ని అంతగా ప్రేమించే మనుషుల్ని దూరం చేసుకోవటం..''

''ఏంటండీ మీరు మాట్లాడేది?'' కోపంగా అంది వనిత.

''అవును వనితా.. ఇన్నాళ్లుగా లేనిది అమ్మకి ఆ ఊళ్లో వెళ్లి వుండాలన్న కోరిక హఠాత్తుగా ఎందుకు కలుగుతుంది? నువ్వే అమ్మ మనసు కష్టపడేలా ఏదో అని వుంటావు. మనల్ని నొప్పించటం ఇష్టం లేక అమ్మ ఆ నిర్ణయం తీసుకుని వుంటుంది..'' ఇంకా ఏదో చెప్పబోయాడు కార్తీక్.

''ఆపండి..'' అంది వనిత ఆవేశంగా.

ఆమెని అనునయించడానికి ఇంకా ఏదో చెప్పబోయాడు.

''చాలు.. ఇంకొక్క మాట మాట్లాడకండి మీరు. మొత్తానికి మగాడనిపించుకున్నారు. ఆడదాని మనసుని అర్థం చేసుకునే ఇంగితం ఆవగింజంతయినా లేదు మీకు. ఈ విషయం గురించి మాట్లాడే అధికారం మీకు లేదు'' అంది వనిత కోపంగా.

''అది కాదు, నువ్వు నీకు తెలియకుండానే అమ్మ మనసు నొప్పించే విధంగా మాట్లాడావేమో! ఒకసారి క్షమార్పణ చెబితే అమ్మ మనసు మార్చుకుంటుందేమోనని..''

''చేయని తప్పుకి క్షమార్పణ చెప్పుకోవడమెందుకు? అయినా ఆవిడ తీసుకున్న నిర్ణయాన్ని అంత తొందరగా మార్చుకుంటారని నేననుకోను''

ఆమె చెప్పిందీ నిజమే. తను చెబితేనే వినని తల్లి వనిత చెబితే వింటుందన్న నమ్మకం లేదు.

'ఇంక ప్రేక్షకుడిలా చూస్తూ వుండడం తప్ప తను చేయగలిగిందేమీ లేదు' అనుకున్నాడు.

★ ★ ★

వసుంధరకి నిద్ర రావడం లేదు.

భర్త మాత్రం ఆదమరచి నిద్రపోతున్నాడు.

కిటికీ లోంచి ఏటవాలుగా పడుతున్న వెన్నెల వెలుగులో కాసేపు అతని రూపాన్ని తనివితీరా చూసుకుంది. ఆమె మనసు ఉద్విగ్నంగా వుంది.

లేచి వెళ్లి బీరువాలో బట్టల అడుగున దాచుకున్న పాత డైరీ తీసింది. ఆ డైరీ అంటే ఆమెకెంతో ఇష్టం. ఎన్నిసార్లు దాన్ని చదువుకుందో లెక్క లేదు. అది ఆమె పెళ్లయిన ఏడాది రాసుకున్న డైరీ.

కిటికీ దగ్గరగా కుర్చీ వేసుకుని వెన్నెల వెలుగులో డైరీని చదవసాగింది.

★ ★ ★

...ఈరోజు నా జీవితంలో మరచిపోలేని రోజు.

ఒక పేద బడిపంతులుకి ఐదుగురు ఆడ సంతానంలో ఆఖరిదానిగా పుట్టిన నాకు ఇన్నాళ్లూ పెళ్లి అనేది ఒక కల.

ఎదిగిన ఆడపిల్లలకి తగిన సంబంధాలు చూడలేక, వచ్చిన సంబంధాలతో తూగలేక అప్పుచేసి పెళ్లిళ్లు చేసి ఒక పక్క అప్పుల వాళ్ల బాధతోనూ మరోపక్క అల్లుళ్ల వేధింపులతోనూ సతమతమవుతున్న నాన్నని చూసి, పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. అందుకే కళ్లు మూసుకున్నప్పుడు కూడా 'పెళ్లి' అనే కల కళ్లలోకి రాకుండా జాగ్రత్త పడ్డాను.

అలాంటి నాకు.. అందమైన భర్త, మంచి మనసున్న అత్తమామలు.. నేను తప్ప నాన్న ఇచ్చే పైసా కట్నం అక్కర్లేదన్న సంబంధం వచ్చిందంటే నాకే నమ్మశక్యంగా లేదు.

ఆయన నన్ను నేను పనిచేసే ప్రయివేటు స్కూల్లో చూసారట. నా గురించి వాకబు చేయడం, మా ఇంటికి పెళ్లిచూపులకి రావటం, పెళ్లి నిశ్చయం చేసుకోవడం అన్నీ ఒక్క రోజులో జరిగిపోయాయి.

అమ్మ, నాన్నల సంతోషానికి అంతులేదు.

ఈరోజు నా జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గరోజు.

మా పెళ్లి జరిగిపోయింది.

పసుపు కుంకుమ, కట్టుబట్టలే సారెగా అత్తగారింట్లో అడుగుపెట్టాను.

పెళ్లిచూపుల్లో ఓరచూపుల్లో సరిగ్గా చూడలేకపోయానుగానీ మా వారు చాలా అందంగా వుంటారు.

ఆయన కంటిచూపే మన్మథుడి వింటి బాణంలా వుంటుంది.

ఆయన నాకేసి చూస్తేనే చాలు.. సిగ్గు ముంచుకొస్తోంది.

ఆయన కౌగిలిలో విచ్చుకోవాలన్న తపనతో నా శరీరం మొత్తం మొగ్గలా అయిపోతున్నట్టుగా అనిపిస్తోంది.

ఉదయం లేచి ఆయన్ని వదిలి గది లోంచి బయటికి రాబుద్ధి వేయడం లేదు. రాత్రి ఎంత తొందరగా గదిలో దూరి తలుపులు వేసుకుందామా అన్న ఆరాటం..

అసలు ఇన్నాళ్లూ ఈయన లేకుండా నేనెలా బ్రతికానా అని ఆశ్చర్యంగా వుంది.

★ ★ ★

పెళ్లి కాకముందు కూడా నేను ఆనందంగానే వుండేదాన్ని.

పూసే ప్రతి పువ్వూ.. ఎదుటివారి పెదవులపై విరిసే చిరునవ్వూ.. అన్నీ నాకు ఆనందాన్నిచ్చేవి.

ఒంటరిగా.. ఒక లక్ష్యం ఏర్పరచుకుని ఆ లక్ష్యం వైపు ప్రయాణిస్తూ జీవించడం బాగానే వుండేది. కానీ ఈ 'సహజీవనం' ఇంకా బావుంది.

స్త్రీకి పురుషుడు, పురుషుడికి స్త్రీ ఎంత అవసరమో నాకిప్పుడిప్పుడే తెలుస్తోంది. వారిరువురి కలయికలో ఇంత ఆనందం, ఇంత అనురాగం, ఇంత ప్రేమ, ఇంత దగ్గరితనం వుంటాయని నాకింత వరకూ తెలియదు.

ఆ ఆనందాంబుధిలో నిండా మునిగి తేలుతున్నాను. (ఈ విషయం ఒప్పుకోవటానికి కూడా నేనేం సిగ్గు పడడం లేదు)

★ ★ ★

మా ఇల్లు చాలా అందంగా వుంటుంది. చిన్నదైనా చూడముచ్చటగా వుంటుంది. పెళ్లికి ముందు ప్రతీ ఆడపిల్లా తన సంసార జీవితం ఎలాంటి ఇంట్లో గడపాలని కలలు కంటుందో అలా వుంటుంది మా ఇల్లు.

ఇంట్లో అన్నింటికన్నా ఇష్టమైన స్థలం నాకు మా పడగ్గది.

ఓ వారగా, గాలీ వెలుతురూ బాగా వచ్చేటట్టు ఇంటి యజమాని కోసం వాస్తు ప్రకారం కట్టించిన పడగ్గదిని పెద్దకొడుకని మాకిచ్చారు మా మామగారు.

మా ఏకాంతానికి వేదిక.


'ఏకాంతం' అంటే గుర్తొచ్చింది... నాకీమధ్యన చిత్రవిచిత్రమైన కోరికలు కలుగుతున్నాయి.

ఈ ప్రపంచంలో ఎవరూ లేకుండా నేనూ ఆయనే వుంటే ఎలా వుంటుందో అని? ఇద్దరం హాయిగా చెట్టాపట్టాలేసుకుని ఈ ప్రపంచాన్నంతా ఓ పిక్నిక్‌కి వచ్చినట్టు చుట్టేసి రావాలని.. ప్రకృతి ఒడిలో ఇద్దరం ఏకాంతంగా సేద తీరాలని.

నా ప్రపంచం ఈ ఇల్లే.. కనీసం ఈ ఇంట్లోనైనా నేను ఆయనతో ఏకాంతంగా గడపగలిగితే ఎంత బావుండును?

★ ★ ★

నాలో స్వార్థం పెరిగిపోతోందనడానికి నిన్న నేను రాసుకున్న రాతలే ఉదాహరణ. కానీ నేను కంట్రోల్ చేసుకోలేనట్టుగా నా మనసులో కోరికలు... చిన్న చిన్న సరదాలు...




ఆయన ఆఫీసు నుంచి రాగానే తలుపు తీసిన వెంటనే ఆయన్ని కౌగిలించుకుని ముద్దులతో నింపెయ్యాలని...

నేను వంట చేస్తుంటే ఆయన వెనుక నుంచి వచ్చి నా నడుము చుట్టూ చేతులు వేసి నన్నల్లుకుపోవాలనీ...

ఇద్దరం కలిసి సరిగంగ స్నానాలు చేయాలని...

ఇలాంటి కోరికలు ఎన్నో మనసులోకి వచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇవన్నీ నాకు నా భర్త మీదున్న విపరీతమైన ప్రేమకీ, మోహానికీ సంకేతాలు కావచ్చు. అది కాదు నా బాధ...

నేను కలలో కూడా అందుకోలేనంతటి ఆనందం నా సొంతమవడానికి కారకులైన మా అత్త మామలనీ, వారి కుటుంబాన్నీ, వారి కుటుంబాన్నీ నా ఆనందానికి అడ్డుగోడలుగా భావిస్తున్నానా?


ఇంత కన్నా స్వార్థం మరొకటుంటుందా?

★ ★ ★

నేను నా కోరికల గుర్రానికి కళ్లెం వేయాల్సిన సమయం ఆసన్నమైంది. మా ఇద్దరి ఏకాంతంలోకి మరో దుందుడుకు దుండగుడు త్వరలోనే రాబోతునానడు.

నేను నెల తప్పాను.

★ ★ ★




డైరీ చదవటం ముగించింది వసుంధర.

ఆ తర్వాత జీవితమంతా కళ్లకు కట్టినట్టుగా వుంది. ఎన్నెన్నో అనుభూతులు... ఎన్నో తీపి జ్ఞాపకాలు!

కార్తీక్ పెళ్లయి ఒక ఇంటి వాడయ్యే వరకూ తమకి సమయమే తెలియలేదు.

నిద్దట్లో భర్త అటు నుంచి ఇటు తిరిగి బద్ధకంగా పడుకున్నాడు. లేచివెళ్లి అతని తలని రెండు చేతులతోనూ నిమురుతూ పెదవుల మీద సున్నితంగా ముద్దు పెట్టుకుంది.

''అబ్బా.. ఏమిటిది? ముసలి వాసన వేస్తూంది'' అన్నాడు రామకృష్ణ.

అతని వీపు మీద ఒక గిల్లు గిల్లింది ఆమె.

''అబ్బా...'' అని అరుస్తూ అన్నాడు అతడు- ''లాభం లేదు.. నీకింకా పడుచుదనం పోలేదు''

''ఏమిటంత బద్ధకం? త్వరగా లేవండి.. ఇవాళే మన ప్రయాణం''

''వెళ్లక తప్పదా?''

''తప్పదు''

''నువ్వు పడుచుదానివే కాదు, మొండిదానివి కూడా'' ఆమెని దగ్గరికి లాక్కుంటూ అన్నాడు.

★ ★ ★

చాలారోజుల తర్వాత ఆ ఇంట్లో అడుగుపెడుతున్న వారిద్దరికీ చాలారోజుల తర్వాత ఊపిరి పీల్చుకుంటున్నట్టుగా వుంది.

''మామయ్యగారు పోయాక మీ అన్నదమ్ముల్లో ఆస్తిపంపకాలపుడు మనకి యాభై వేలు నష్టమొచ్చినా మన వాటాకి ఈ ఇల్లే కావాలని ఎందుకన్నానో అర్థమైందా?'' అంది వసుంధర తను మొదటిసారిగా కాపురానికొచ్చిన ఆ ఇంటిని అపురూపంగా చూసుకుంటూ. ''అది సరే కానీ.. నాకొక విషయం చెప్పు.. మన కొడుకూ కోడలికీ ఏకాంతం కల్పించాలనే కదా నువ్వీ ఏర్పాటు చేసింది?'' అడిగాడు రామకృష్ణ.

వసుంధర నవ్వింది.

''మీకూ మీ అబ్బాయిలాగే ఆడవాళ్ల మనసుని అర్థం చేసుకోవడం అస్సలు చేతకాదు. వాళ్లు చదువుకున్న వాళ్లు. తెలివైన వాళ్లు. వాళ్లకెప్పుడు కావాలంటే అప్పుడు ఏకాంతాన్ని కల్పించుకోగల చొరవ, ఆర్థిక స్తోమత వాళ్లకున్నాయి. నేనీ ఏర్పాటు చేసింది మనకోసం... ఒకప్పుడు మనం తీర్చుకోలేకపోయిన చిన్న చిన్న కోరికలనీ సరదాలనీ తీర్చుకుందామని''

ఆ ఇంట్లో.. పాత జ్ఞాపకాలతో, మధుర స్మృతులతో వాళ్లిద్దరూ పాతిక సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయి చిన్న పిల్లలే అయిపోయారు. ☆